

# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబర్ 2012

సంపుటి : 18 (214) సంచిక : 11



## మాట మనిషిని కలుపుతుంది; మనసును కలుపుతుంది! మంచి బాటను నడిపిస్తుంది! మాట తూటాల్లా పేలి మనిషి మనగడనూ పరిమార్చుతుంది!!!

### - ఆంధ్రదేశంలోనే కాదు, అఖిల భారతదేశంలో రగుల్తున్న దౌర్భాగ్యం -

'రామో విగ్రహాన్ ధర్మ' అన్నారు రామాయణం వ్రాసిన వాల్మీకి. రామాయణ గ్రంధాన్ని సకల ధర్మ సుధాసార గ్రంథంగా పఠించినవారు, దేశదేశాల పండితులు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకూ, ఉన్నత ధర్మాచరణకూ ఆ గ్రంథం అద్దం పట్టింది. ఆ గ్రంధ రచన చేసిన వాల్మీకి బోయవాడు. వేద ధర్మ సుధాసార గ్రంథాలను జౌపోసన పట్టినవాడు కాదు, గురువు వద్ద శిష్యరికం చేసినవాడూగాడు. కళ్ళముందు ఓ బోయవాడు చేసిన అకృత్యాన్ని దర్శించి వివశుడై, నారద మునీంద్రుడుపదేశించిన 'రామరామ' నామాన్ని తిరగేసి 'మరా' 'మరా' యని స్మరించుకుంటూ రామస్మరణతో మైమరిచిన జ్ఞాని, ఆ శ్రీరామచరిత మునే వ్రాసి – **'రామో విగ్రహాన్ ధర్మ'** యని ఎలాగ అనుభవించి వివరించే అన్నాడో ఈ ముచ్చటైన ఈ మూడు పదాల్లో వ్యక్తపరిచాడు

**మృదుభాషీచ రాఘవ । మితభాషీ చ రాఘవ । పూర్వభాషీచ రాఘవ –** అని కట్టె, కొట్టే అన్నట్లు చెప్పాడు. మన పెద్దలు కూడా **మాటే భూషణం** అన్నారు. మాటే నిన్ను భూషింపచేస్తుంది' అన్నారు. **మాటల చేత దేవతలు మన్నన చేసి వరంబులిత్తురు। మాటల చేత కామినులు మన్నన చేసి 'సౌఖ్యంబులిత్తురు' మంచి మాటలు నేర్వకున్న అవమానము న్యూనము మానభంగమున్ – అన్నారు భగవాన్ సత్యసాయి బాబావారు.** సనాతన ధర్మ భూయిష్టమైన వేదోపనిషత్తులు –


**సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం**
**ప్రియంచ నానృతం భూయాత్ ఏష ధర్మ సనాతనః –** అన్నది

సత్యమునే పలుకాలి. ఆ సత్యాన్ని ప్రియంగా చెప్పాలి. ప్రియంగా చెప్పమన్నారని ఆ సత్యం చెప్పరాదు అన్నది భారతీయ సనాతన ధర్మం. సత్యం ధర్మానికి కట్టుబడుతుంది. ధర్మం శాంతికి కట్టుబడుతుంది. శాంతి ప్రేమకు కట్టుబడుతుంది. ప్రేమ అహింసకు కట్టుబడుతుంది. సత్యము వాక్కుకు సంబంధించినది. ధర్మము శరీరమునకు సంబంధించినది. శాంతి మనస్సుకు సంబంధించినది. ఈ మూడు త్రికరణములు, ఈ మూడింటిని ఏకం చేస్తేనే 'ప్రేమ' యవుతుంది. ప్రేమలో మరో మంచి గుణములు రెండున్నాయ్. అవి **క్షమ, త్యాగములు.** వీటి కారణముగా మానవుడు కర్తవ్యవిముఖుడు కాలేడు.

గీతాచార్యుడు అర్జునునితో ప్రస్తావిస్తూ – **నమే పార్థాస్తి కర్తవ్యం – త్రిషులోకేషు కించిన నానవాప్తమ, వాస్తవ్యం– వర్త ఏవచ కర్మణి!** ఓయీ అర్జునా నాకీ మూడు లోకములందూ చేయదగిన కార్యమేమీలేదు. మరియు పొందబడనిదియు, పొందదగినదియునగు వస్తువునూ లేదు. అయిననూ నేను కర్మయందు ప్రవర్తించుచున్నాను.

నేను కర్మ చేసి తీరాలి. ఇది నా కర్తవ్యం. కర్మాచరణము భగవంతునికి కూడా కర్తవ్యమైనపుడు మానవుడు కర్మలు చేయకుండా కర్మసన్యాసం పుచ్చుకుంటామంటే, ఇది కేవలము, పిరికితనం, బలహీనత. కర్మసన్యాసం కన్నా కర్మయోగమే ఉత్తమమైనది. యోగమంటే కర్మకౌశల్యం. సన్మార్గంలో, సదుద్దేశంతో ఈ కర్మలను చేయాలి. సదానందాన్ని అనుభవించాలి, సర్వులనూ ఆనందము ననుభవింపచేయాలి. **'సర్వకర్మ భగవత్ ప్రీత్యార్థం'** అనే దృష్టితో సత్కర్మల నాచరించాలి. కర్మను చేయకుండా ఫలిత మాశించరాదు. ఆ కర్మను చేయువఱకే తనకు అధికారమున్నది.

'కర్మ' అనేదేదో కష్టభూయిష్టమైన పెద్దమాటగా భావించేవారుండవచ్చు. గుణకర్మ, సుగుణ కర్మ అనే రెండు లక్షణ విభాగాలున్నాయ్. గుణకర్మలు వృత్తులు. వాటిని పరస్పరావసర, సహకారములతో, సృష్టిపరంగా, సృష్టి ప్రశాంతిగా నడచుటకు, పోటీలు పడకుండుటకు కష్టసుఖా సమయములందు సమైక్య సహకార భూతులగుటకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణ విభాగాల్జేసి, సంఘోపకర వృత్తులను నిర్ణయించాడా భగవానుడు. పంచముడు, దళితుడు అనే పదాలనే సూచించలేదు. ఎక్కువ తక్కువ ప్రశ్ననుదయింపచేయలేదు. భగవద్గీతను నిత్యమూ పఠించే గాంధీగారు సహితమూ వారిని హరిజనులనీ అంటరానివారు కారనీ విపులీకరించి చెప్పారు. స్వామి సీతారాం, ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి, కొండా వేంకటప్పయ్య, అనంతశయనం అయ్యంగార్, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ప్రభృతులు శతవిధాలుగా వారి అభ్యున్నతికి విశేష కృషి చేసారు. ఆస్తులను దేశంకోసం, దీనజన సేవకోసమే విని యోగించి కట్టుబట్టలతోనూ, చినుగు బట్టలతోను దేహత్యాగం చేసిన నాయకుల దేశం ఆంధ్ర దేశం. భూదానోద్యమ సమయంలో వినోబా భావేకు లక్షలాది ఎకరాలను దానం చేసినది ఆంధ్ర సిరిమంతులే! ఆయన చరిత్రలో కూడా వ్రాసుకున్నారు. గాంధీగారి స్వాతంత్రోద్యమా నికి మెడలోని మంగళసూత్రములు, చేతిగాజులూ తీసియిచ్చి మెడలో పసుపు కొమ్ము కట్టుకుని, చేతులకు మట్టిగాజులు వేసుకున్నది తెలుగు ఆడవారే! అలాంటి దేశంలో ధర్మం యెలా గాడి తప్పింది? పనిగట్టుకొని అసమానత లెవరు సృష్టిస్తున్నారు? వర్గకలహాలు, ప్రాంతకలహాలూ, పార్టీ కలహాలతో దేశ సర్వ సంపదలను ఎవరు భూస్థాపితం చేస్తున్నారు? పాలకుల్ని దూషిస్తూ, పాలకులను కూల్చుకుంటూపోతే దేశం అరాచకమవుతుంది. రాక్షసం రెక్కలు విచ్చుకుంటుంది. ఇప్పటికే విచ్చుకత్తుల్లా విచ్చుకుంది. రాష్ట్ర సర్వతోభివృద్ధికి అందరూ సాయపడడం ధర్మం.



బుధజన విధేయుడు ***గోటేటి శ్రీరామారావు***

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# అమ్మ అలిమేలు మంగమ్మ బ్రహ్మోత్సవాలు

## నవంబర్ 9 నుంచి 18 వరకూ అత్యంత వైభవంగా జరుపుటకు తిరుచానూరు ముస్తాబయింది!!!

*మునిముని నవ్వుల ముగ్ధమోహన ఆపదమొక్కులవాడు, ఏడుకొండల వేంకటేశ్వరునికి సెప్టెంబరు, అక్టోబరుల్లో రెండు బ్రహ్మోత్సవాలు రంగరంగ వైభవంగా జరిగాయ్. ఆపదమొక్కులవాని హృదయేశ్వరి అమ్మ పద్మావతమ్మ బ్రహ్మోత్సవాలు జరుపుటకు తిరుచానూరు పెళ్లికూతురులా ముస్తాబయింది. అమ్మ బ్రహ్మోత్సవాలు లక్షలాది భక్తులకు నేత్రోత్సవాలు. పద్మావతీ అమ్మ పరిపూర్ణ ఆశీస్సులందుకొనే తరుణం, తరించే నవరాత్రముల్లో అమ్మను దర్శించి ఆయురైశ్వర్య సౌభాగ్యములందుకోండి.*

## ఆది శంకరభగవత్పాదుల ఈ భువిని అణువణువునా సనాతనధర్మోక్తులు నాటబట్టే ధర్మదేవత అనుగ్రహం పొందుతున్నాం.

# మా అమ్మ కనకదుర్గమ్మ! కనకపుష్పాలు ప్రసాదించునమ్మ!



ఆంధ్రదేశంలో 'అయ్య(దేవుళ్ల) ల క్షేత్రాలెన్ని ఉన్నాయో, అమ్మల క్షేత్రాలన్ని ఉన్నాయ్. భారతదేశమాతగా భారతిగానూ, దుర్గగానూ, సిరులమ్మగానూ, ముమ్మూర్తుల మూలపుటమ్మను సురారులమ్మయని కొలుస్తున్నాం.


శ్రీ కృష్ణుణ్ణి వివాహం చేసుకొనే ముందు రుక్మిణి 'దుర్గ' ను పూజించినట్టు భాగవతం చెబుతున్నది. పద్మావతిని పరిణయమాడే ముందు శ్రీనివాసుడు 'దుర్గ'ను పూజించినట్లు వేంకటాచలచరిత్ర చెబుతూంది. పాండవ మధ్యముడైన అర్జునుడు అజ్ఞాతవాసమునకేగు సందర్భములోనూ, తిరిగి ఆయుధాలను శమీవృక్షం నుంచీ తీసుకునే సందర్భంలోనూ 'దుర్గ'నే పూజించారు. శివాజీ భక్తిని మెచ్చి శ్రీశైలభ్రమరాంబ 'ఖడ్గము'ను ప్రసాదిస్తూ, అశీర్వదించింది. ఆదిశంకరాచార్యులువారు 'శ్రీకనకదుర్గానందలహరి'లో 'అమ్మవారిని' ప్రార్థిస్తూ–

**దరిద్రం శ్రీమంతం జరరమబలానా'ం ప్రియతమం**
**జడం సంఖ్యానంతం సమరచలితం శౌర్యకలితం**
**మనుష్యం కుర్వంతోమరపరివృఢం నిత్యసదయాః**
**కటాక్షేస్తే కార్యామయి కనకదుర్గే భవతి!** – స్తుతించారు.

అమ్మా! నీవు దరిద్రుణ్ణి శ్రీమంతునిగను, బలములేక నీరసించిన వాణ్ణి ప్రియతమునిగను, బుద్ధిలేనివాణ్ణి జ్ఞానం కలవానిగనూ, యుద్ధభీతి కలవానిని శౌర్యవంతునిగను, సామాన్యమనుష్యుని దేవతామయునిగనూ నీ కృపాకటాక్షముల వలన కదా. అమ్మా, భగవతీ! కనకదుర్గీ! నా యందు అటువంటి కృపావీక్షణములే అనుగ్రహించుమమ్మా' యని స్తుతించారు.

కనకధారాస్తోత్రంలో ఆ యింటి ఇల్లాలి దరిద్ర దీనావస్థను చూచి, ఆమె భిక్షగా యిచ్చిన 'ఉసిరికాయ'కు ప్రతిఫలంగా ఆ యింట పసిడికాసులు కురిసేట్టు అనుగ్రహించారు. అంతటి కరుణామూర్తి శంకర భగవత్పాతులు. శివకేశవ బేధం లేకుండా ఆయన అందరి దేవతా మూర్తులనూ స్తుతించారు. ఆయనకు అమ్మవారంటే ఎంత భక్తో 'సౌందర్యలహరి'లో వ్యక్తపరిచారు. అస్పృశ్యత నివారించడం కోసం 'మనీషా పంచకం' రచించారు. అనేక గ్రంథాలకు వ్యాఖ్య వ్రాసారు. **'భజగోవిందమ్'** మనిషి లోని అజ్ఞానమును తొలగించడానికి వ్రాసారు. మహావిదుషీమణి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి స్వరం కట్టి ఆలాపించి, ప్రపంచమంతటా దాని మాధుర్యాన్నీ, అంతరంగ ఆధ్యాత్మికతనూ వీనుల విందుగా గానం చేసి శ్రోతలెల్లరునూ తన్మయపరిచింది. ●

## -భగవాన్ సత్యసాయి శంకరభగవత్పాదుల గురించి ప్రస్తుతిస్తూ -



ఏకాత్మతత్త్వమే అద్వైతం. అద్వైత దర్శనమే జ్ఞానము. మనస్యేకం, వచ స్యేకం, కర్మణ్యేకం, మహాత్మానం'. దీనినే 'త్రికరణశుద్ధి' అంటారు. శంకరాచార్యుల వారి వద్ద నిర్దుష్టంగా కనిపించే తత్వం ఇదే. వారి గురువులు 'నాయనా! నీవు సకల విద్యాపారంగతుడవైనావు. ఇక నీవు కాశీకి బయల్దేరు. అక్కడ పండితులకు జ్ఞానం బోధించు. అద్వైత సిద్ధాంతమును జగద్వ్యాప్తిగావించు. ఇందుకు నీవే సమర్థుడవు' అని ఆశీర్వదించి పంపించారు. కాశీనందొక పండితుడు చెట్టుక్రింద కూర్చుని 'డుకృణ్,డుకృణ్, కర్ణే' అని వ్యాకరణం చదవడం చూసారు. నాయనా! మూఢునిలా కాలాన్నెందుకు వ్యర్థపరుస్తావ్.

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితేకాలే నహినహిరక్షతి డుకృణ్ కరణే!**

–మూఢుడా! అంత్య సమయంలో నిన్నీ వ్యాకరణం రక్షించదు. బంధుమిత్రులు నీకు తోడురారు. ధనకనక వస్తు వాహనాలు నీ వెంటరావు. నీ వెంట, ఇంట, జంట ఉండి కాపాడేది దైవ చింతన ఒక్కటే! అని చెప్పి, శంకరులు తన శిష్యులతో కాశీలోని పండితుల సమావేశానికి వెళ్ళారు. అక్కడున్న పండితులందరూ పెద్ద పెద్ద కంకణాలు చేతులకు వేసుకుని, మెడనిండేట్టు రుద్రాక్ష మాలలు, ఆ పైన ఖరీదైన బంగారు పట్టీ శాలువా కప్పుకుని దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. శంకరుల వారు మాత్రం మోకాలు వరకూ పంచె కట్టుకుని, పైన ఒక చిన్నతువ్వాలు వంటిది కప్పుకుని ఉన్నారు. అక్కడి పండితులు గుసగుసలు ప్రారంభించారు. లోకమెరుగని పిన్నవయసులో ఉన్నాడు. పండితుడంటే ఏలా ఉండాలి. ఇతడి చేతికి కంకణం గానీ, మెడలో రుద్రాక్షమాలగానీ లేదు– అంటూ చూస్తున్నారు. శంకరులు అందరికి వందనం చేస్తూ– ధనదాహమునూ, ఆడంబరమును వీడండి. దైవ దాహమునూ, ధర్మదాహమునూ పెంచుకోండి' అంటూ భజగోవింద తత్వం, అద్వైతతత్వం గూర్చి ఉపన్యసిస్తూ, సమదృష్టి గలవారే పండితులనీ, కర్మఫలితమే విత్తమని, కల్గినంతలో సంతృప్తిపడుతూ, దైవచింతనం కలిగి ఉండమని చెప్పేసరికి పండితులందరూ విస్తుపోయారు. తొలిపండిత సదస్సులోనే శంకరులు విజయ పత్రం పొందారు' అంటూ బాబావారు చెప్పారు. కావున భారతదేశ ధర్మం ఈనాటివరకూ నిలబడిందంటే ఆదిశంకరులే కారణం.



# అస్సాంలో కామాఖ్యగా వెలిసిన సతీదేవి!

బ్రహ్మపుత్ర ఒడ్డున నీలాచల్ పర్వత పంక్తులలో పచ్చని ప్రకృతి మధ్య ఉండే నగరం గౌహతి. ప్రాచీన చరిత్రలో కనిపించే "ప్రాగ్జోతిషపురం" ఇదే. దీన్ని "నరకాసురుడు" మరియు అతని కుమారుడు "భగతీదత్తుడు" పరిపాలించారు. అస్సాం అనే పదం అసోమా అనే సంస్కృత పదం నుండి వచ్చింది. ఈ కామాఖ్య ఆలయం గురించి కలికిపురాణంలో ప్రస్తావన ఉందని ఇక్కడివారు చెపుతారు...

దక్షప్రజాపతి యజ్ఞం చేస్తూ తన కుమార్తె సతీదేవిని, అల్లుడు పరమశివుని తప్ప అందరిని ఆహ్వానించాడు. విషయం తెలుసుకున్న సతీదేవి వెళ్ళి తన తండ్రిని నిలదీసింది. ఆమెను తండ్రి మరింత అవమానించాడు. అది భరించలేని ఆమె ఆత్మాహుతి చేసుకుంది. దుర్వార్తను విని భార్య శవంతో శివుడు మహోగ్రంగా నర్తించాడు. ఆమె పార్ధివ శరీరాన్ని శ్రీమహావిష్ణువు తన సుదర్శనచక్రంతో ఖండించగా అవి 51 ప్రదేశాలలో చెల్లాచెదురుగా పడింది. నిజానికి ఈ ఆలయంలో ఏ దేవతా రూపం ఉండదు. గర్భగుడిలో నల్లని చిన్నరాయి మాత్రమే ఉంటుంది. ఈ ఆకృతి చుట్టూ నిరంతరం నీరు స్రవిస్తూ ఉంటుంది. ఇక్కడ సంప్రదాయం మేరకు ఆరాతినే భక్తులు తాకి, అర్చనలు చేస్తారు. నరకాసురుని కాలంలో ఈ ఆలయంలో పూజలు ప్రారంభమైనాయి. మొదట నిర్మించిన ఆలయాన్ని ముస్లిం దండయాత్రలో నాశనంకాగా. 1565 లో రాజాకాచి నారాయణ్ దీనిని పునర్నిర్మించాడు. అయితే ఈ రాజవంశీయులకు ఆలయప్రవేశంలేదు. దానికి సంబంధించి ఒక కథ ప్రచారంలో ఉంది. పూర్వం ఈ ఆలయంలో రోజు సాయంవేళ అర్చన చేసేటప్పుడు హారతి కూడా ఇచ్చేవారట. హారతి పట్టెడు పూజారి ఆ సమయంలో నృత్యం చేసేవారట. అప్పుడు అమ్మవారు పూజారికి దర్శనమొసగేది. తనుకూడా అమ్మవారిని దర్శించాలని రాజు ఆశపడ్డాడు. ఆవిషయం పూజారికి చెబితే హారతి ఇచ్చేటప్పుడు తలుపు చాటునుండి చూడవలసినదిగా కోరాడట. ఇది తెలుసుకున్న అమ్మవారు పూజారిని శిలగా మారిపొమ్మని శపించి, రాజవంశీయులెవ్వరూ ఆలయ ప్రాంగణంలోనికి, తన దర్శనానికి, రాకూడదని శాసించింది. అప్పటి నుండి రాజవంశీయులెవ్వరూ ఈ ఆలయం వైపుకురారు.

ఈ క్షేత్రానికి ఇంకో ప్రత్యేకత ఉంది. ఏటా జూన్–జూలై నెలలలో "అంబూబాచి" అనే మేళా జరుగుతుంది. అమ్మవారి గర్భగుడిలో స్రవించే నీరు ఆ రెండు మాసాలలో ఎరుపుగా ఉంటుంది. ఆమె బహిష్ఠ అయినట్లు భావించి ఆ మూడు రోజులు తలుపులు మూసివేస్తారు. నాలుగో రోజున తెరచి చూచి పూజలు చేసి పండుగ జరుపుతారు. ఈ వేడుక మొత్తం అస్సాం రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరుపుతారు. ఇంకా ఇక్కడ కాళి, తారా, భైరవి, చినమస్తా, భగళ, ధూమవతి, బాసుమతి పేర్లతో అమ్మవార్లు వెలసి ఉన్నారు. అలానే కామేశ్వర, సిద్ధేశ్వర, కోటిలింగా, అఘోరా, అమృతకేశ్వర పేర్లతో శివుడు పలుదేవాలయాల్లో పూజింపబడుతున్నాడు. ఇక్కడ జూ, పార్కు, పురావస్తు ప్రదర్శనశాల, లలిత, సంధ్య, కాంత అనేనదుల సంగమస్థలం ఉన్నది. ఇక్కడే వశిష్ఠుడు ఆశ్రమం నిర్మించుకున్నాడని స్థానికులు చెపుతారు. బ్రహ్మపుత్రానది ఉరకలు వేస్తూ ప్రకృతి సోయగాలకు నెలవైన ఈ ప్రదేశం హిందువులు ఎంతో పవిత్రంగా భావించే శక్తిపీఠాలలో ఒకటి.

– బెల్లంకొండ నాగేశ్వరరావు

## ముఖపత్రం

**యుగ** గురువు సాయి రాముడు!!

'భోక్తారం యజ్ఞతపసాం –
సర్వలోక మహేశ్వరమ్ సాయిరామ్'

యజ్ఞతపస్సులకు భోక్త సమస్త భక్త జనావళిలో శుభంకరుడు, అవ్యాజ దయాళువు సాయిరాముడే! సాయీరామ్ నమో నమః!

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్నాయంటే జలగం వెంగళరావు గారే గుర్తుకు వస్తారు!!

## - ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రీ ఆయనే! ప్రజలు మరిచిన ముఖ్యమంత్రీ ఆయనే! -

ప్రజలకు మరిచిపోవడం అలవాటయితే ప్రజానాయకులకు వారి స్మృతిపథం నుండి ఆ నాయకులను చెరిపివేయడం అలవాటు. ముఖ్యంగా ఆంధ్రులకున్న మహత్తరరోగం! తమిళుల్లోగానీ, బెంగాలీల్లో గానీ ఈ దురలవాటు కనిపించదు.

ఆంధ్రప్రదేశం విషయానికి వచ్చినపుడు 1973 సం॥ము డిసెంబర్ నుంచి 1978 సం॥ము వరకూ ముఖ్యమంత్రిగా పనిచేసిన జలగం వెంగళరావుగారి పాలనాకాలం బంగారు యుగం అని చెప్పాలి.


1921 సం॥ములో కృష్ణాజిల్లాలో అతి సామాన్య కుటుంబంలో జన్మించి, పెరిగిన వెంగళరావు, ఏ కారణాల కారణంగా వెళ్లారో గాని ఖమ్మం జిల్లా బయ్యన్న గూడెం వెళ్ళారు. అక్కణ్ణుంచే ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రపంచాయితీరాజ్ చాంబర్ అధ్యక్ష పదవిని నిర్వహించారు. వేమూరు నుండి ఆంధ్రప్రదేశ్ శాసనాసభా సభ్యునిగా వరుసగా మూడు పర్యాయములు ఎన్నికయ్యారు. అప్పుటి కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న మంత్రి వర్గంలో హోం శాఖామంత్రి పదవిని నిర్వహించారు. దాదాపు నూరుశాతం ఆ జిల్లా రాజకీయాలకు ఆయనే దిక్సూచిగా నిలిచారు. ఆయన హోంశాఖామంత్రిగా ఉన్న కాలంలోనే నక్సలైటు ఉద్యమం ప్రబలింది. ఆ ఉద్యమాన్ని అణచే ప్రయత్నంలో అధికార యంత్రాగాన్ని సమర్థవంతంగా నడిపి, ఆయన తనరాజకీయ దక్షతను నిరూపించుకున్నారు. సమర్థుడైన మంత్రిగా నిరూపించకోవడంతో, ఆయన్ను కాంగ్రెసు హై కమాండ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఎన్నికచేసారు. 1973 డిసెంబర్ 10 నుండి 1978 సం॥ము మార్చి 6 తేదీ వరకూ ఆయన మూడు ప్రాంతాల ప్రజలకు సమర్థుడూ, ప్రియతముడైన ముఖ్యమంత్రిగా పేరు వహించారు. ఆయన తన మంత్రివర్గంలో మండలి వెంకట కృష్ణారావును విద్యాసాంస్కృతిక శాఖామంత్రిగా నియమించారు. వారిరువురి మధ్య అవగాహన బాగా ఉండేది. మంత్రివర్గంలోని ఏ ఒక్కరి మధ్యనూ సాన్నిహిత్యమే తక్క, బేధాభిప్రాయానికి తావుండేది కాదు. జలగం వెంగళరావు, మండలి వెంకట కృష్ణారావు లిరువురూ ఆంధ్ర(మాతృ) భాషాభిమానులు. సంస్కృతీ సాంప్రదాయాలను పాటించేవారు. ఇరువురి పంచెకట్టు, చొక్కా, పై కండువా తీరులు ఆంధ్ర సాంప్ర దాయాన్ని కుంభవృష్టిలా కురిపిస్తు న్నట్టూండేది. ఎక్కడకు వెళ్ళిననూ ఆ సాంప్ర దాయబద్ధ ఖద్దరు దుస్తులను గోచీ పంచె కట్టును విడనాడే వారుకాదు.



సతీమణితో జలగం వెంగళరావు

### మద్రాసులో తెలుగువారున్నారని వారిని తమ కార్యక్రమాల్లో కలుపుకొనే భావనాపరులు వారు!

1975 సం॥ములో తొలి తెలుగు ప్రపంచ తెలుగు మహాసభలు జరిపే సందర్భ ములో ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మండలి వెంకట కృష్ణారావు లిరువురూ మద్రాసు వచ్చి మద్రాసులోని ఆంధ్ర సోదరులందర్నీ, చెన్నపురి ఆంధ్ర మహాసభలో కలుసుకుని మహాసభల గూర్చి వివరించడం, ఓపిగ్గా, ఎంతో సహనంతో మాట్లాడడం – నాకీ నాటికీ గుర్తు ఉంది. అప్పటికి నేనో పెద్ద పౌరుడిని గాకపోయిననూ, నన్నూ గుర్తించి మాట్లాడడం, నేను అప్పుడు నిర్వ హిస్తున్న 'మధురవాణి' పత్రికను గురించి తెలుసుకోవడం సంతోషం కలిగించింది. కణుపులేని గడకర్రలా (అప్పుడు చాలా సన్నంగా ఉండేవాణ్ణి) ఉండేవాణ్ణి, వారి తీయని మాటలతో ఒళ్ళంతా తెలుగుతీయ దనంతో మురిసి పోయింది.



కొత్తగూడెం ఆకాశవాణి స్టూడియోలో నాటి కేంద్రమంత్రి జలగంతో అనంతపద్మనాభరావు తదితరులు

అప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమం త్రులూ, మంత్రులూ పిలిచినా పిలు వకపోయిననూ చెన్నయ్ వచ్చేవారు. ఎక్కడో ఒకచోట తెలుగువారందర్నీ కలుసుకొని, సమావేశమై, కలుపుగోలుతనంతో మాట్లాడేవారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఉన్న పి.వి. నరసింహారావు, సాంస్కృతిక శాఖామంత్రి అక్కిరాజు వాసుదేవ రావు గారు కూడా వచ్చి, ఎన్టీరామారావు వంటి ప్రసిద్ధ సినిమా వారిని కూడా సమావేశపరిచి, సమస్యలు తెలుసుకోవడం, సలహాలు కోరడం అనే సాంప్రదాయం ఉన్నది. తెలుగుదేశం పార్టీవచ్చి ఆ సాంప్రదాయాన్ని సన్నబరిచింది. అటు తరువాత వచ్చిన కాంగ్రెసు ముఖ్యమంత్రులు కూడా వారి అడుగుబాటలోనే అడుగువేసారు.

వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రియైన తరువాత ఆ సాంప్రదాయ గొలుసును గొడ్డలితో తెగకొట్టి, మద్రాసులో అఖిల భారత తెలుగు సమాఖ్యతో చేతులు కల్పి, అఖిల భారత తెలుగు మహాసభలు జరిపించడం, ఆయన వచ్చి పాల్గొనడం జరిగింది. కానీ ఆ అదృష్టం చూసే భాగ్యం నాకు కలుగలేదు. అప్పుడు నేను అమెరికాలో పర్యటిస్తూ, ఈ అదృష్టాన్ని కోల్పోయాను. ఆయన ఎందరో తెలుగు ప్రముఖుల్ని స్వయంగా సత్కరించిన అదృష్టం నాకు దక్కలేదు. తరువాత మండలి వెంకట కృష్ణారావు తెలుగువారిని కలుసుకొనే సాంప్రదాయాన్ని కొనసాగించారు. ఆయన ప్రపంచ తెలుగుసమాఖ్య అమెరికాలోని 'తానా' వారు కలిసి న్యూయార్కులోని న్యూ ఐలాండులో జరిపిన ప్రపంచ తెలుగు మహాసభలకు, ఆరోగ్యం అనుకూలించ కున్నానూ మద్రాసు మీదుగా అమెరికా వెళ్ళి, తిరుగు ప్రయాణంలో మద్రాసువచ్చి రెండురోజులుండీ నావంటి వారిని కలుసుకుని సంతోషపరిచారు. ఈ విషయంలో నా బాల్య మిత్రుడు బొండాడ వెంకటరాధా రమణగుప్తను ప్రశంసించక తప్పదు.

వెంగళరావు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఖమ్మం జిల్లా పారిశ్రామికాభి వృద్ధికి ఎంతగానో దోహదపడ్డారు! ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలం లోనే ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలకు మూడు కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారం భింపచేశారు. అవే కాకతీయ విశ్వ విద్యాలయం, నాగార్జునా విశ్వవిద్యా లయం, శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యా లయం.

కాంగ్రెసు హైకమాండ్ వద్ద ఓ దురాచారం ఉంది. ఇందిరాగాంధీ నుంచి ఆ ఆచారం సాంప్రదాయంగా కొనసాగుతున్నది. ఇన్ని మంచి పను ల్జేసిన జలగం వెంగళరావు గారికి, 1984 సం॥ము వచ్చిన ఎన్నికల్లో పార్లమెంటు స్థానానికి మార్చేసారు. అయితే ఆయన ఇష్టమైన ఖమ్మం పార్లమెంటు స్థానం నుంచే ఘన

విజయం సాధించారు. ఇందిరాగాంధీ ఆయన్ను వదులు కోకుండా కేంద్రంలో పరిశ్రమల శాఖా మంత్రిగా నియమించారు. ఆయన కేంద్ర మంత్రి అయిన తరువాత కూడా ఆయన ఖమ్మం పార్లమెంట్ నియోజికాభివృద్ధికెంతో కృషి చేసారు. ఆయన చేసిన వాగ్దానాలు వేటినీ మరిచేవారు కారు.


## కొత్త గూడెంలో ఆకాశవాణి కేంద్రం

వెంగళరావు కేంద్ర పరిశ్రమల శాఖా మంత్రిగా ఉన్నపుడు 1989 ఫిబ్రవరిలో ఆంధ్రా పర్యటనకు వచ్చి, తన నియోజకవర్గమైన ఖమ్మం వచ్చారు. అక్కడ ఆయన ప్రభుత్వ విశ్రాంతి భవనంలో దిగినపుడు పత్రికా విలేఖరులు ఆయనతో సమావేశ మయ్యారు. అప్పుడా విలేఖర్లు లోని కొందరు 'సార్! కొత్తగూడెంలోని ఎఫ్.ఎం కేంద్రం దేశంలోనే తొలి స్వతంత్ర ఎఫ్.ఎమ్ కేంద్రం అని చెప్పారు. కేంద్రప్రభుత్వ సంస్థ సింగరేణివారు భూముల్లో ఎఫ్.ఎమ్. రేడియో భవనాలకు, సిబ్బందికి ఇళ్ళూ ఇంజనీరులకు ఇళ్ళూ పధ్నాలుగు నెలల్లో నిర్మించియిచ్చారు. కానీ ఇంకా ఎందుకు ప్రసారములను ప్రారంభించలేదు అంటూ ప్రశ్నించారు. ఆ ప్రశ్న వెంగళరావు గారికి శరాఘాతంలా తగిలింది. ఆయన విసుగును దరికి చేరనీయని ప్రశాంతమైన మనిషి, చేతల మనిషి గానీ మాటల మనిషి కాడు, మాటకారీకాడు. ఆయన వెంటనే ఆంతరంగిక కార్యదర్శి వైపు తిరిగి, మనం ఆంధ్ర ఎప్పుడు వస్తున్నాం' అంటూ అడిగారు. అతడు మార్చి 23న వస్తున్నాం సార్! అన్నాడు. వెంటనే ఆయన కార్యదర్శిని చూస్తూ, మార్చి 24 న కొత్తగూడెం రేడియో కేంద్రం ప్రారంభిద్దాం. ఏర్పాటు చూడమని చెప్పండి అన్నారు–అని ఢిల్లీకి బయల్దేరి వెళ్ళారు. ఆయన కార్యదర్శి అయిన కె.వి. రావుగారు ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ అమృతరావు షిండే గారిని పిలిపించి, మంత్రిగారిని కలవమన్నారు. ఆయన జలగం వారిని కలిసి కొత్తగూడెం ఎఫ్.ఎమ్. స్టేషన్‌ను మార్చి 24 న ప్రారంభిస్తున్నాను. ఏర్పాట్లు చూడండి అన్నారు. అప్పటికింకా భవనంలో గోడలే తక్క యంత్రాలు లేవు. అప్పటి ఖమ్మం జిల్లా కలెక్టర్ ఐ.వై. ఎస్సార్ కృష్ణారావు గారికి మార్చి 24 న రేడియో కేంద్ర ప్రసారానికి వెంగళరావు గారు నిర్ణయించారని చెప్పడంతో, వారు జాయింట్ కలెక్టర్ శ్యామ్‌బాబుకు బాధ్యతలు ఒప్పగించడం, వారు యితర రేడియో కేంద్రాల నుంచీ సిబ్బందిని రప్పించి, యంత్రాలను రావించి, ఒక నెలకు సరిపడే కార్యక్రమాలను కూడా సిద్ధం చేయడం జరిగింది. ఇహ ఆహ్వాన పత్రాలు అచ్చొత్తించే సమయం వచ్చింది. రాష్ట్రముఖ్యమంత్రి ఆ కార్యక్రమానికి రావాల్సి ఉన్నది. అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి ఎన్టీరామారావు. ఆకాశవాణి డైరెక్టర్ ముఖ్యమంత్రిని స్వయంగా కలుసుకోవడానికి వెళ్ళారు. ఆయన ప్రత్యేక కార్యదర్శికీ విషయం విన్నవించారు. కాంగ్రెసుకూ, ఎన్టీరామారావు గారికీ అసలు గిట్టదు. ఇద్దరు ఒకే వేదికపై, అందులో ఖమ్మంజిల్లా వేదికపై కూర్చోవడానికి కుదరని పని. కావున సమాచార, పౌర సంబంధ శాఖమంత్రి గారుపాటి వివేకానందగారిని పిలవండి – అంటూ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ సమాధానమిచ్చినట్టు చెప్పారు. ఆకాశవాణి డైరెక్టర్ ఆ మంత్రి గారిని కలిసి, అంగీకారం పొందేసరికి మార్చి 21 వచ్చేసింది. అప్పుటికప్పుడు ఆహ్వాన పత్రాలు అచ్చొత్తించి, అధికారులు జిల్లా యంత్రంగానికంతకూ ముఖ్యులకు పంచారు. వెంగళరావుగారికి సాంప్రదాయం అవసరం, జ్యోతిప్రజ్వలనానికి దీపం వత్తులు, నూనె కావాలి. సద్యోసృష్టిలా అధికారులూ దీపాలూ సంపాదించారు. వెంగళరావు గారు వచ్చిన తరువాత మంత్రి వివేకానంద ఫోటో కవరింగు కోసం వచ్చినట్లుగా వచ్చారు. మంత్రుల ప్రసంగాలను స్టూడియోలో ధ్వని ముద్రితం చేసారు. ప్రారంభోత్సవం జరిగిపోయింది. హమ్మయ్య అంటూ అధికారులు స్థిమిత పడ్డారు. ఆర్. ఆనంతపద్మనాభరావు అక్కడే ఉన్నారు ఈ రేడియో కేంద్ర విశేషమంతా ఆర్. అనంత పద్మనాభరావు 2011జులై 6 నవ్య వారపత్రికలో వ్రాసిన వ్యాసం ఆధారంగా గ్రహింపబడింది. (మిత్రులు అనంత పద్మనాభరావు గారికి, 'నవ్యపత్రికకు కృతజ్ఞతలు వెల్లడిస్తున్నాం!)

చిత్తశుద్ధితో చేసిన నాయకుల పనులకు ప్రజలు కృతజ్ఞతను వెల్లడించకుండా కొరతలు వెదకడం మనసాంప్రదాయం. వారు అధికార పార్టీ అభిమానులు కావచ్చు–ప్రతిపక్షం అభిమానులు కావచ్చు. కొత్తగూడెం ప్రభుత్వ అతిధిభవనంలో ఉన్న జలగం వెంగళరావు గారిని అక్కడి ప్రజలు ఘరావ్ చేస్తూ , ఆకాశవాణి ప్రారంభంతో తమ టి.వి.లు పనిచేయడంలేదు. మరో 6 నెలలు ప్రసారాలు ఆపివేయాలన్నారు. వెంగళరావుగారు తొణకలేదు, బెణకలేదు, వారిని నిందించలేదు. అక్కడున్న చీఫ్ ఇంజనీరును పిలిచి, వారంరోజుల్లో ఈలోపాలన్నిటినీ సరిచేయండి అంటూ టాటా చెప్పారు. అదీ జలగం వెంగళరావు ప్రత్యేకత. రాజకీయాల్లో మచ్చ లేనివాడు, మత్సరంలేని వాడు, అకళంక కాంగ్రెస్ నాయకుడు వెంగళరావు. 1999 సం॥ము జూన్ 12 న ఆయన ఈ లోకంతో పని ఏమని వెళ్లిపోయారు. ఆయన ఆత్మ ఎక్కడున్నా శాంతిగా ఉండాలి. వెంగళరావులా పనిచేసే నాయకుడు తిరిగి పుడతాడేమో వేచిచూద్దామనుకున్నా, ఇప్పటికీ ఒక్కడూ పుట్టలేదు. ●




పెరుగుతున్న జనాభాలో మనిషికే చోటు కరువవుతున్నప్పుడు న్యాయానికి చోటుంటుందని అనుకోవడం అతి ఆశే! అనంత విశ్వాన్ని జౌపోసన పట్టినట్టు వెదికి చూచినా, పాత చరిత్రలన్నిటినీ పుట్ట పుట్టలుగా పోసినా, అడవిలో అనాగరికంగా మానవుడులా ఒకణ్ణి ఒకడు చంపుకొనే తింటున్నాడు. ఒంటినిండుగా బట్ట, ఇల్లు చక్కబెట్టే ఇల్లాలు, చూలాలు ముందుతరం గూర్చి ఆలోచించడంలేదు అమ్మను మించిన దైవం లేదని దైవం దగ్గరికే పంపిస్తున్నాడు! పాలు యిచ్చే అమ్మలు పోయి పాపాలు కట్టుకునే అమ్మలూ వచ్చారు. కడుపున పుట్టిన ఆడబిడ్డ కనులు సరిగా తెరవక మునుపే మురికి కూపాల్లో పడేస్తున్నారు. బాగా చదువుకున్న ఆడపిల్లలు ప్రేమలంటూ పోయి నెలతప్పిన తరువాత ఋతుస్రావమో ఆత్మహత్య చేసుకోవడమే, ప్రియుని ఆసిడ్ వాతబడిపోవడమో ఇప్పుడు బుల్లితెర సీరియల్‌లా చావయిపోయింది. ప్రభుత్వాల చేత కాని తనంతో బుల్లితెర సీరియల్లు కుట్రలూ, కుతంత్రాలు, హత్యలూ, దొమ్మీలు, దోపిడీ అంశములతో తీస్తున్నారు. ఆ సీరియల్స్ కుటుంబాల్లో చిచ్చులూ, రచ్చలూ యెలా పెట్టాలో బుల్లి టి.వి.తెరపై చూపిస్తున్నారు. **ఔరా–ఇంత ద్రోహం తగునా అని అడిగేవారే లేరు.**





# పదహారేళ్ల పడుచుకు పరికిణీ ఓణీలే తెలుగు సాంప్రదాయం!

సాంప్రదాయం మరిచిన కన్నెపిల్లలందరూ ప్రమాదంలో పడుతున్నారు. బికినీలు, పొట్టి నిక్కరు జీన్సు కన్నెపిల్లకు సహజానందమూ, సౌందర్యమూ కలిగించవు. తెలుగు సాంప్రదాయంగానే కాదు, చాలా మంది దక్షిణాత్యులైన ఆడపిల్లలు పరికిణీ, గౌనులు వేసుకోవడం, వయసు పెరుగుతున్న కొద్దీ కొద్ది మార్పు, పరికిణీపైన జాకెట్టు తొడుక్కుని, చీరచుట్టినట్టుగా ఓ పమిటకండువాను వేసుకోవడంతో, ధరించినవారికీ, దర్శించినవారికీ ఆ అందమే ఆనందమిచ్చే అందంగా ఉంటుంది. శరీరంలోని జిగిబిగులేవీ కనిపించకుండా, పరికిణీ వోణీ ధరించడం, వొయ్యారపు నడకలొలికిస్తుంది. ఒక కవిగారు చెప్పినట్టు **అంత వసంతమంతమూ వనాంతమునుగాక, కన్నె వదనాంతమునందు వసంతం పూయిస్తుందని చెప్పినది సత్యమే.** నడుమునుంచీ పాదాలవరకూ జీరాడుతూ, నడకతో, వయ్యారంగా, నాట్యం చేస్తుందా అన్నట్టు ఆ పరికిణీ కుచ్చెళ్ల అంచులు భూమికి తాకుతూంటే భూదేవత కూడా 'కన్నెమందారమా, నీ వస్త్రధారణం కనువిందు కావిస్తున్నది! పిరుదలవరకూ, వేలాడే వాలుజడ, సిగలో మల్లెపూచెండులు మకుటములనిపించి, శ్రీ మహాలక్ష్మి వంటి సౌందర్యం కల నీకు శ్రీ మహావిష్ణువువంటి వాడే పతిగా రావాలనీ, ప్రకృతీ, పుడమీ రెండు దీవిస్తాయనేవారు పూర్వులు. పాపాయి తొలిపుట్టినరోజునాడే పట్టు పరికిణి కట్టి, పైన ఓ పట్టు గౌనును వేసి, నుదుట, అక్కున అక్కులు బొట్టును పెట్టి మురిసి ఒరిసే బామ్మలే కరువైపోయారు. ఆడపిల్లను బొమ్మలా శరీరం కనపడకుండా, చేతికి రంగురంగుల మట్టిగాజులు వేసే బామ్మలూ, అమ్మమ్మలూ లేరు. ఒకవేళ ఉన్ననూ వారికి ఆ పాత అలంకరణ తెలియదు. వారే వేసుకోనపుడు ఇక పిల్లలకు ఎలా వేయగలరు? బంగారుగాజులు వచ్చేసరికి మట్టిగాజులు మట్టికొట్టుకుని పోయాయి. గాజులు, గాజులమ్మగాజులు అంటూ వీధుల్లోకి వచ్చే చిరువర్తకులు లేరు. మట్టిగాజులు దృష్టిబారకుండా ఉండడానికి, గిలుముబట్టి అలెర్జీలు రాకుండా ఉండడానికేగాక,చేతులను ఇంద్రధనస్సువలే తోజో భరితం చేస్తాయ్. శరీరానికెంతో శ్రేయం చేకూరుస్తాయ్. అవి వేసుకుని నడుస్తూన్నప్పుడు, ఆ గాజుల గలగల గురించిరేలంగి పాడినపాటే ఉన్నది. **'గాజులేసుకుని గలగల మనే స్వరఝుళి వింటే రాజులు, రాజ్యాలొదిలేసారోయ్, గాజులమోజులో పడ్డారోయ్'** అని పాడారు. **నాచేతికి గాజులు అందమైతే, నీ చేతికి మురుగులు అందమౌతాయ్ బావోయ్–** అనే గ్రామీణ ముద్దుగుమ్మల ముద్దుపాటలున్నాయ్. అలాగే స్త్రీకి జడకుచ్చులు అందం. ఒక్కప్పుడు శిరోజాల నిడివిచాలక సవరములు జతకలిపి జడ వేసేవారు. ఇప్పుడు శిరోజాల నిడివి కత్తిరించుకోవడమే ఫాషన్! పొడుగ్గా ఉన్న శిరోజాలు వేలాడాలని, సవరం జత పరుచుకుని జడగంటలు ధరించాలనే భావనమూ లేదు, అవసరమూ లేదు. జడను కత్తిరించుకోకపోయినప్పటి కినీ, జుట్టుని విరబోసుకుని దయ్యంలా ప్రత్యక్షమవ్వడం– అది మంచిది కాదనీ, ప్రేతతత్వమనీ చెప్పిననూ వినిపించు కోరు. రాగజీవితాన్ని రోగజీవితంగా మలుచుకుంటున్నవారే ఎక్కువ. **నిలువవే వాలుజడలదానా, వయ్యారీ హంసనడకదానా! నువ్వు కులుకుతు నవ్వుతు నడుస్తువుంటే నిలువదె నా మనసు–అదీ నీకే తెలుసు!** అన్న సినిమా పాట ఎందరెందర్నో ఆ బాటలో నడిపించింది. అదొక కల. ఆలాటి సినిమాలూ, ఆరోజులిక రావు.



# ఈ నవ్వులను కాపాడుకోలేమా

కుసుమ కోమలుల చిరునవ్వుల సౌభాగ్యమే తెలుగుతల్లికి మణిహారాలు! పుచ్చపువ్వులాంటి ఆ నవ్వులు శరత్కాల శశాంక వెన్నెలలు. మనదేశంలోనే కన్నెపిల్లలను పూజించే సుహృద్భావన ఉన్నది. ఆ నవ్వుల నయనగారములోనే నవరత్నాలు విరబూస్తాయ్. కట్టూ, బొట్టూ, కను, ముక్కు తీరులున్న స్త్రీలు భారతీయ హృదయంలో మాతృదేవతలు, మహాలక్ష్ములు, ముందుతరాల సృష్టికర్తలు. స్త్రీల సిరిని చిదిమివేయకండి! ప్రేమలంటూ వంచనచేసి హత్యలు చేయకండి! ఆత్మహత్యలకు దోహదమివ్వకండి! మహాలక్ష్మీ కళలన్నీ మన స్త్రీలలోనే ఉన్నాయ్! స్త్రీ సౌభాగ్యం దేశసౌభాగ్యం! ఆమె ఆనందిస్తే పుడమితల్లి ఆనందిస్తుంది. ఆమె శోకిస్తే పుడమి మరుభూమవుతుంది. పుట్టిన ఆడబిడ్డను పుట్టినరోజుననే పెంటకుప్పలో పోసే వెధవల్లారా! గ్రహించండి!



# కాదేవీ చిత్రకళ కనర్హం - కమలా ప్రసాదరావు చిత్ర కథనం



వేణువు వంటి వేళ్ళ చిగురు గోళ్ళ నుంచి విశ్వకవి రవీంద్రుడు, రాజా రవివర్మ, అనిరుద్ధుడు, విశ్వకర్మ, జక్కనవంటి చిత్రకారుల కుంచెలే ఇంచుక కుంచపడ్డాయా–అనిపించింది. రాయల కాలంలో యుగయుగాల కళలను అధిగమించి చిత్రాలు వేసి, శిల్పాలుగా దిద్దిన దాఖలాలున్నాయ్. భారతీయ చిత్ర, శిల్ప కళను బోతిక్ చతురంగ చిత్రకారులు 'భువి'లోనే లేరంటారు. సాగరంలో మునిగి తేలిన 'ద్వారక' నగరం, ఎన్ని సునామీలు, సాగర కెరట ప్రకంపనలు వచ్చినా, చెక్కు చెదరని రామేశ్వరాలయం, మదురై, చిదంబరం, కాళహస్తీశ్వరాలయములూ, అజంతా, ఎల్లోరా, మహా బలిపుర గుహ కుడ్యాలూ, ఓరుగల్లు, తిరుమల కూడా (ఇప్పుడన్నీ ధనాశాపూరిత మనస్సుతో పడగొట్టబడినా, ప్రకృతి శిల్పీకరణం చేసిన శిలాతోరణంను అలాగే ఉంచారు.) ముసలిదైన ఊర్వశి శరీరము ధగ ధగలు తగ్గుతుందా అన్నట్టు, శిధిలమవుతూన్న హంపీ విజయనగరం కన్నురెప్పలను వాలకుండా చూచే శక్తిని కలిగిస్తుందిప్పటికీ!

అవన్నీ ఒక ఎత్తు. చిత్ర కళాపాశంగలకమలా ప్రసాదరావు వేళ్ళు కుంచెలై, చిత్రీకరించిన యీచిత్రాలన్నీ ఒక ఎత్తు. వ్యర్ధ పదార్థాలతో

*(తరువాయి 10వ పేజీ)*









**ఎన్నో మిఠాయిలు ఎన్నో ప్రాంతాలనుంచి వస్తున్నాయ్. కానీ ఆనాటికీ ఈనాటికీ బందరు తొక్కుడు లడ్డూ మిఠాయ్‌కున్న రుచీ, ప్రత్యేకత దేనికీ లేదు. పేటెంటు కల తీపి మిఠాయి – తింటుంటే హాయి సార్థకమైంది.**

**బందరు అన్నా, మచిలీపట్నం అన్నా ఒక్కటే. కానీ బందరు బందరు లడ్డూకే పరిమితం కాదు. బ్యాంకులూ, ఇన్సూరెన్సు కంపెనీల స్థాపనమే గాకుండా, గాంధీ గారికి తలలోని నాలుకగా మసిలిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, ముట్నూరి కృష్ణారావు, కాటూరి వెంకటేశ్వరరావు, పార్వతీశం, పింగళి నాగేంద్రరావు వంటి దిగ్గజాలు, నోబుల్ కళాశాల వంటి విద్యాలయం, గోల్డు కవరింగు ఆభరణ తయారీ కింగులు, త్యాగధనులైన స్త్రీ పురుషులను కన్న పోతుగడ్డది.**

**అట్టి క్షేత్ర విశేషజ్ఞత కల మచిలీపట్టణంలో పోతురెడ్డి నరసింహారావు, విఠల్ గౌరీశ్వరీల ముద్దు బిడ్డగా 1949వ సంవత్సరంలో జననమంది, పి.వి.వి.యస్ ప్రసాదరావు అర్ధాంగియై, హరికృష్ణ యనే కొమరుణ్ణి, రాధయనే కొమారైను 'మేమిద్దరం మాకిద్దరు' అంటూ మురిపెములొసగే కుటుంబీకురాలై – 1986 సం॥ము నుంచి సరదాగనే చిత్రకళపైన పరదా పరచుకుని ప్రపంచ ప్రఖ్యాతగనిగా డా॥ పాశం కమలా ప్రసాదరావు పేరును పెంచుకుంది.**

**ఈ అమ్మ గారి కొడుకు హరికృష్ణ – వల్లీశ్వరితో కుటుంబీకుడై, కుమారై రాధ – ఉదయ్‌ను హృదయానికి (హృదయేశ్వరునిగా) చేర్చుకుని– ఇరు కుటుంబాలూ టెక్సాస్ రాష్ట్రంలోని హూస్టన్‌లో ఉంటున్నారు. ఇది చిత్రకళాపాశం వారి సంక్షిప్త పాశపు పాశురమ్!**

# ప్రపంచ తెలుగు మహాసభలు జరిపిస్తున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జిందాబాద్!


## - తిరుపతి పట్టణంలో డిసెంబర్ ఆఖరి వారంలో జరుగనున్నాయ్!! -



ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఆటుపోట్లకు గురియవుతున్న ఆపద పదల సమయంలో ఆంధ్రప్రదేష్ ముఖ్యమంత్రి గౌ॥ కిరణకుమార్‌రెడ్డికి ప్రభుత్వ ధనంతో ప్రపంచ తెలుగు మహాసభలు (2012 విషాద సంవత్సరం వెళ్ళేలోగా) డిసెంబర్ ఆఖరు వారంలో మూడు రోజులపాటు ఘనంగా జరుపాలని నిర్ణయించడం బహుదా ప్రశంసనీయ విషయం. ఇందు నిమిత్తార్ధం 22 కోట్ల రూపాయలు కేటాయించడం, అమాత్యులనూ, అధికారులనూ ప్రోత్సహించడం తెలుగు భాషా ప్రచారానికి కలికితురాయి పెట్టినట్లవుతుంది.

వై.యస్.రాజశేఖరరెడ్డి కాలంలో అసెంబ్లీ స్పీకర్‌గా సామర్థ్యం చూపిన కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాణించడానికి, సర్వవిధములుగా కృషి చేస్తున్నప్పటికినీ, తెలంగాణా సకల జనుల సమ్మె ఆయన పాలనను, ప్రభుత్వ ఆదాయములనూ గండి కొట్టింది. భీరుడు గాకుండా, నిబ్బరంగా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవడమే గొప్ప విషయం.

ఆయన అసమర్ధుడు కాదు, గంట గంటకూ వస్తున్న గండాలను ఎదుర్కొంటున్న ధీశాలి. కాంగ్రెసెలోని బహు నాయకత్వం, వెన్నుపోటులూ సహజమే! కానీ, ఇవి కిరణ్‌కుమార్ రెడ్డికి అనుభవం లేనివి. ఎన్నో మంచి పనుల్జేసి, ప్రజా సంక్షేమం కోసం, కాంగ్రెస్ అధిష్ఠానం మెప్పులు పొందిన వై.యస్.రాజశేఖరరెడ్డి సేవలను మరిచిన రాజకీయ పాలక, ప్రతిపక్షాల పావుల్లో నలిగిపోతున్ననూ, కిరణ్‌కుమార్‌రెడ్డి నెట్టు(గ్గు)కు వస్తూ, ప్రపంచ తెలుగు మహాసభలపై దృష్టి నిగిడ్చీ, విశ్వసనీయులైన అమాత్యులూ, అధికారుల తోడ్పాడుతో సభలను దిగ్విజయంగా నిర్వహించగలరని విశ్వసిస్తున్నాం. జలగం వెంగళరావు గారి పట్టుదల కనిపిస్తూంది. కానీ మద్రాసులో ఎందరో తెలుగువారున్నారనీ, రాజకీయంగా రాష్ట్రంతో విడివడినా కళాసాహితీ రంగాల ఘనులున్నారని గ్రహించండి. ఇక్కడ ఆంధ్రులు ప్రవాసులు కాదని గుర్తించండి.




*(9వ పేజీ తరువాయి)*

చిత్రాలూ, బొమ్మలూ చేసిన విద్దెకారులెందరో ఉన్నా, వ్యర్ధ పదార్ధములకు పరమార్ధ పరమ ప్రమాణమునూ అపురూప, అనుపమ చిత్రములుగా తీర్చిన యీ కమలము పారిజాత కుసుమమునూ అనుటలో నేనెట్టి అభ్యంతరమూ పడుటలేదు సరికదా అబ్బురపడుతున్నాను, అభినందిస్తున్నాను.

గ్లోబల్ వరల్డు ఎవార్డు, వరల్డు యూనిక్ రికార్డు, వండర్ రికార్డు హోల్డర్స్ రికార్డు, 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డు' 'అయోజింగ్ వరల్డు' రికార్డు పొందిన ఈ చిత్రకారిణిని గోరంతయినా చూడకున్నా, కొండంత చిత్రకళా సంపత్తిని చూసాను. అందుకే 'గోరంత దీపం కొండలకు వెలుగు' మా యింటి ఆడపడుచు మా కంటి వెలుగు అన్నారు.

మిత్రులు, శ్రేయోమూర్తులూ, భాగ్యనగర వంశీ ఇంటర్నేషనల్ కనుచూపుయైన సంస్కృతీరత్న కె.ధర్మారావు ఈ విషయం ఫోనులో చెప్పగా ముదమందాను. సచిత్రపరంగా విషయాలు పంపగా అద్భుత చిత్ర వైచిత్రికి సమ్మోహితుణ్ణయ్యాను. కాలిఫోర్నియాలోని బర్కిలీ యూనివర్సిటీ హస్తకళల సృష్టికర్తగా అభినందిస్తూ, గౌరవ డాక్టరేటును చిత్రకారిణి పాశం కమలా ప్రసాదరావుకు ప్రదానం చేయడంతో, విదేశాంధ్రులూ, స్వదేశాంధ్రులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వంటి సకల కళాసాహిత్య సమాకృతి సంస్థలు గౌరవించడం మహత్తరమైన విషయం. పుష్పగిరి పీఠాధిపతులు, ఇలాటి మంచి పనులకు ముందుండే వంశీ ఇంటర్నేషనల్ సంస్థ, వంశీ రామరాజు, విజయవాడ, ముంబాయి, మదనపల్లి, అమెరికాలోని షికాగో, డెట్రాయిట్, బోస్టన్, ఆల్బమా, న్యూయార్కు, న్యూజెర్సీ, వాషింగ్‌టన్ డి.సి, పిట్సుబర్గ్, అట్లాంటా, హ్యూస్టన్, డాలస్, వర్జీనియా, శాన్ ఆంటోనియా వంటి వివిధ రాష్ట్ర నగరాలు వారు సత్కరించారంటే, క్రౌంచ ద్వీపంగా పేరొందిన ఆ ఖండమంతా అఖండంగా గౌరవించినట్లే!

ఏఁవిటయ్యా పాశం కమలా ప్రసాదరావు కళాకృతులపై పాశం ఎందుకని అంటే – ఆమె సాధారణ చిత్రకారిణి కాదు. కుంచతోనే కంచె వేసుకుని సరిపెట్టుకోలేదు. ఇసుక, గాజు ముక్కలు, పగిలిన చేతిగాజులు, యాలక తొక్కలు, వివిధ ఫలముల గింజలు, చింతపిక్కలు, గుడ్డముక్కలు, సీసామూతలు, బ్లేడులు, పెన్సిలు చెక్కిన పొట్టు, అంపపు పొట్టు, నేలపై పారవేసే వ్యర్థ పదార్ధాలను బీరుపోకుండా, నిప్‌పెయింటింగ్, కోనే పెయింటింగు, ఎంబ్రాయడరీ, లేసు వర్కు, ఎన్‌గ్రేవింగు, ఎంబోజింగ్, తేలికయిన ఆట వస్తువులు, ఈను పుల్లలు, అగ్గిపుల్లలు – కాదేవి చిత్రకళకు అనర్హమనియనుకోకుండా 400ల వైవిధ్యభరితమైన కళాకృతులను చేసి అబ్బుర పరిచిన **పాశం కమలకు** మరొకరు సాటిరారు అన్న ప్రతిభ కనపరిచింది. తాను నేర్చుకున్న ఈ వింత విశిష్ట చిత్రకళలను తనవద్దకు వచ్చే వారికి ఉచితంగా నేర్పడంలో ఈమె ఔదార్యం, ఔన్నత్యం ప్రస్ఫుటమవుతుంది. ఈమెకొచ్చిన అవార్డులు, రివార్డులు, బిరుదములు, సత్కారములు, ప్రశంసలిచ్చిన వివిధ రంగాల ప్రముఖులను గూర్చి, ఆమె గీచిన వారి చిత్రాల గురించీ వివరించాలంటే, ఓ సహస్రనామ స్తోత్రమవుతుంది. ఇంకోసారి ముచ్చటించుకుందాం. **చిరంజీవ సౌభాగ్యోభవ. ఆచంద్ర తారార్క కీర్తిరస్తు** – అని దీవిస్తున్నాం.

# ఇందిరాదత్ అవిరళ కృషితో ఇటు భాషా అటు ప్రపంచ స్త్రీ కార్మికులూ లబ్ధి పొందారు!

# ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రపంచ గుర్తింపు పొందింది మద్రాసు నుంచే - ఇందిరాదత్‌యే కారకురాలు!!

ఆమెకు పుట్టింట ముక్త్యాల రాజుగారి ఫలవంతమైన కృషీ- ఇటు అత్తింట వెలగపూడి రామకృష్ణగారి కుటుంబ పరిశ్రమల నిర్వహణా ప్రభావం రెండింటితో దక్షత గల దీక్షానుభావాలు ఇందిరాదత్ రక్తనాళాల్లో జీర్ణించుకుని పోవడం వల్ల ఏ కార్యక్రమం చేబట్టినా చిత్తశుద్ధితో ఎవరి అవసరం లేకుండా ఆమె యొక్క అసాధారణ శక్తి విజయప్రసాదితమవుతున్నది!



చిరునవ్వుల ప్రసన్నమూర్తి

ఆచంట రుక్మిణీపతి, దుర్గాబాయ్ దేశముఖ్, రుక్మిణీ అరేండేల్ వంటి వారలు కూడా ఒకే దృష్టితో ఒకే కార్యాభివృద్ధిని పదింతలుగా వర్థిల్లడానికి కారకులయ్యారు.

మరి ఇందిరాదత్‌కు నాన్నగారి దేశభక్తికరమైన ప్రజలకాధార భూతమైన నీటిపారుదల ప్రాజెక్టులతోబాటు, స్త్రీ సంక్షేమం, జీవన సాహితీ పోషణ ఆయకు ప్రధానంకాగా, ఇటు మామ వెలగపూడి రామకృష్ణ పరిశ్రమల స్థాపన, నిర్వహణ, విద్యారంగ పోషణలు ధ్యేయమయ్యాయి. ఆ రెండింటినీ దేశానికి ప్రాణాధారములని గ్రహించిన ఇందిరాదత్, వాటినేగాకుండా, ప్రపంచ వ్యాప్తిగా ఉన్న తెలుగు మాతృభాషపై తీపిదనం కలిగిద్దామని ప్రపంచ తెలుగు సమాఖ్య బాధ్యతలు వహించడమే గాకుండా దేశంలోని అనేక ముఖ్యనగరాల్లో, సింగపూర్, దుబాయివంటి ఇతరదేశాల్లో తెలుగుమహాసభలు జరిపి, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రదేశాల్నుంచీ జానపద సాంస్కృతిక బృందాలను తీసుకునివెళ్ళి అక్కడ వారికి తెలుగు వారి వివిధ కళలను రుచ్యమయ్యేట్టు ప్రదర్శింపచేసారు. సార్క్ దేశ మహిళల పారిశ్రామికాభివృద్ధి సమాఖ్య అధ్యక్షురాలిగా ఇందిరాదత్ కృషి అపారం. అటు కె.సి.పి.లిమిటెడ్ యాజమాన్యపనులను చూచుకుంటూనే ఇలా ఎన్నో సామాజిక కార్యక్రమాలకు వెన్నుదన్నుగా ఉండడం ఆమెకే చెల్లింది. తెలుగు భాషాభివృద్ధిపట్ల, మహిళా సంక్షేమం పట్ల ఇందిరాదత్ సేవలు నిరుపమానమైనవి. తదుపరి ప్రపంచ తెలుగు మహాసభలను మలేషియాలో జరుపుటకామె సన్నాహాలు చేస్తున్న ఇందిరమ్మకు శుభాశీస్సులు. ●



భార్యాభర్తలు



శోభారాజును సన్మానిస్తూ...



# నిలువెత్తు మనిషి! మనిషికి మరో నిలువెత్తున మనసు! ఆయనే రమణీ రమణుడు



ఆయన నిలువెత్తు మనిషి. ఆ మహా మనిషిలో మరో నిలువెత్తున సంస్కారం!

బలిజేపల్లి లక్ష్మీ కాంతకవి చెప్పినట్టు ఆ- నిలువెత్తు సంస్కారానికో నిలువెత్తున సాహిత్యం, సౌజన్యం, పద్యకవితాప్రియత్వం, వెరశి మంచితనం, మందహాసం, ఆయన సొత్తు. అయోధ్యా రాముడంతటి మర్యాద గుణం, ఔదార్యగుణం- ఏ పదవి చేబట్టినా, పోతన పద్యంవలె పండిత ప్రకాండులనుంచీ. అక్షఱం తెలియని వారివరకూ- రమా హృదయ రమణుడు, రమా రమణుడనుపించుకునే కె.వి.రమణాచారి (కవి రమణాచారి IAS (Iam all at yours) అనిపించుకొనే ఘనుడు.

ఆయన కృషి కారణంగానేభాగ్యనగరంలో కళా సాంస్కృతికరంగాలు నక్షత్రరాశుల్లా పెరిగాయ్. నందీ నాటకోత్సవాలంటూ ఆంధ్ర నాటక రంగానికి ప్రోత్సాహం, పలు పట్టణ కేంద్రాల్లో నాటకోత్సవాలూ, సురభినాటక సమాజానికి పునర్వైభవం ఆయన కారణంగానే కలిగాయ్.


ఆయన్ను కవి యందామా, కళాకారుండందామా, రాయలకాలంలోని సాహిత్యం, కళలు, కవులదర్బారులూ, అణగిమణగియున్న జానపద కళల్ని పునర్జీవింపచేయడానికి వచ్చిన అపరభోజుడందామా, శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు పంపిన అష్టకవిదిగ్గజముల ఏకరూపుడందామా, ఏమందాం? నిండు నూట ఇరవై ఏండ్లూ జీవిస్తూ షోడశకళలతో విలసిల్లిన అలనాటి ఆంధ్ర కళాభారతిగా దేశం వర్ధిల్లడానికి, పద్యం, గద్యం, హృద్యమంగా భారతీ ప్రసన్నత నొందిన కంకంటి పాపరాజు కంటి రెప్పలు అందామా? సాహితీలలామ వెలుగొందే క.వీ.రమణగా సాహిత్యసాంస్కృతిక, కళారంగాల్లోని కాలుష్యాన్ని రూపుమాప గలరనీ రమారమణ రూప మానసుడవైన రమణా నీకు రిటైర్మెంటు లేదు. రీహైర్మెంటూ లేదు. కలకాలం కలిమిబలిమిల కలయికగా కలకాలం ఉండాలని ఆశీర్వదిద్దాం. ●



# తల్లితండ్రుల పట్ల దయలేని పుత్రుండు పుట్టనేమి!


## -కొడుకులు లేని ధృతరాష్ట్రునికి నూరుగురు కొడుకులు కలిగి కొరివి పెట్టగలిగారా?-

### భూమిమీద అమ్మనాన్నలకు మించిన దైవాలులేరని మోటారు సైకిల్‌పై తల్లితండ్రుల ఫోటోలు పెట్టుకుని ప్రచారయాత్రకు దిగాడో రామనాథుడు!!




గృహస్థితులు సుంతయైననూ మారలేదు, గృహస్థితులే సాంతమూ మారిపోయాయి!! తల్లీ తండ్రీ దైవములురా– వారిని ధిక్కరించి బ్రతుకు కొనసాగింపకురా! తల్లిని మించిన దైవము వేఱే ధారుణి లేదోయ్. తండ్రిని మించిన పరమేశ్వరుడు లేనేలేడోయ్! – యీ పాత ప్రాతః స్మరణీయపాటలను మరిచి, నీతిరహితం, నిత్యరోగ, దరిద్రములతో పస్తులు పడుతూండే కాలంలో బ్రతుకుతున్నాం.

రాజకీయ రథాలూ రణగొణ ధ్వనితో దుమ్మురేపుతున్న యీ రోజుల్లో–భూమిమీద అమ్మానాన్నల్ను మించిన దేవుళ్ళెవరూ ఉండరు. వారు సజీవంగా ఉన్నప్పుడే సుఖంగా చూసుకోవాలి, పూజించుకోవాలి. వారు చనిపోయినపుడు తిథులు పెట్టి ఏడాదికో తద్దినం, తబుకులు పెట్టడంగాని, పాశ్చాత్యుల్లా వృద్ధాశ్రమల్లో పడేసి, ఫాదర్స్‌డే, మదర్స్‌డే అంటూ చూచిరావడంగానీ మన సంస్కృతి కాదు అనే సదుద్దేశంతో ప్రచారం చేస్తూ ఎం.వి.రామాచారి పద్దెనిమిదేళ్ళ పద్దెనిమిది వారాల పద్దెనిమిది రోజుల చైతన్య యాత్రను అవిశ్రాంతంగా ప్రారంభించారు.



ఆయన మాటల్లోనే ఈ అభినవ శ్రవణ కుమార్‌ని మాటలు విందాం:

అమ్మానాన్నలను మించిన దైవాలు భూమి మీద ఎవరూ ఉండరు. వాళ్ళను సరిగ్గా చూచుకోవాల్సిందీ, పూజించాల్సిందీ వారున్నప్పుడేగానీ, చనిపోయినప్పుడు కాదు. చనిపోయిన తరువాత కూడా వారు మనకు ఆశీస్సులు యిస్తూనే ఉంటారు. పున్నాగ నరకం నుంచీ వారిని తప్పించేది మనమే!

## తండ్రిని మరచిన పుత్రరత్నం అక్షింతలు వేసిన కోర్టు!



'అద్దాల నాడు బిడ్డలు గానీ... గడ్డాల నాడు బిడ్డలా' అన్న సామెత గుర్తుచేసుకుని బాధపడుతూ కూర్చోలేదా పెద్దాయన. పెంచి పెద్దచేసి, చదువు చెప్పించి, అమెరికా వెళ్ళేందుకు కూడా డబ్బులిస్తే... చివరకు తనకు తిండిగింజలు కూడా పెట్టని కొడుకును కోర్టుకీడ్చాడు. అమెరికా నుంచి రప్పించి బోనులో నిలబెట్టాడు. సూరత్ సమీపంలోని నవసారి అనే పల్లెలో ఉండే అప్పి సతరావాలా తన కుమారుడు పుసి కోసం పడని కష్టాలంటూ లేవు. అంత కష్టపడి పెంచి అమెరికా పంపితే... ఆ తర్వాత కనీసం తండ్రికి తినడానికి డబ్బులున్నాయో లేవో కూడా చూడలేదా సుపుత్రుడు. దాంతో సతరావాలా ముసలి వయసులో కూడా దుకాణాల్లో అకౌంట్లు రాసుకుంటూ, పూజారికి సహాయకుడిగా ఉంటూ నెలకు రూ.1500 సంపాదించ సాగాడు. ఇంతచేసిన కొడుకుపై కడుపుమంటతో కోర్టులో కేసు వేశాడు. నెలకు రూ.5 వేలు పోషణార్థం తండ్రికి పంపాలని కోర్టు ఆదేశించినా, కొడుకు పట్టించుకోలేదు. దీంతో సతరావాలా అమెరికన్ కాన్సులేట్‌ను, అమెరికాలో భారతీయ రాయబారకార్యాలయాన్ని ఆశ్రయించి కొడుకును రప్పించాడు. ఇక్కడి కొచ్చాక... కొడుకు చెన్నైలో అత్తవారింట్లో కూర్చుని రాజీకోసం తండ్రికి రాయబారం పంపాడు. మనసు విరిగిన తండ్రి ససేమిరా అని... కోర్టుకు రావల్సిందే నన్నాడు. 11 ఏళ్లనుంచి కనీసం తనతో మాట్లాడేందుకు కూడా అతడికి మనసు రాలేదని, పుట్టిల్లు విడిచి అత్తవారింటికి వచ్చి మాట్లాడుతున్నాడని ఆవేదనచెందాడు

భారతంలో చనిపోయిన పాండురాజు నరకవిముక్తి కాలేదని భగవానుడు పాండు కుమారులచే వారికి పితృతర్పణాలను సమర్పింపచేసాడు. పంచమ వేదమైన 'మహాభారతం' చెప్పిన సత్యమిది!

–మాది శ్రీకాకుళం జిల్లా పాత పట్నం. నేను అక్కడ కోదండ రామాలయంలో పూజారిని; ధర్మకర్తను. పౌరోహిత్యం వాస్తు, జ్యోతిషం అన్నీ చెప్పేవాణ్ణీ, చేసేవాణ్ని. ఆ పనుల మీద చాలా మంది ఇళ్లకు వెళ్లినప్పుడు వారు వారి తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం గమనించుతుండేవాణ్ని. మరొక సంఘటన నన్ను తీవ్రంగా కదిలించింది. అదేంటంటే మాఊళ్లో కోటీశ్వరుడొకాయన ఉండేవాడు. ఉన్న ఆస్తిని నలుగురు కొడుకులకూ పంచి యిచ్చాడు. కొంతకాలానికి ఆయన భార్య కూడా అనారోగ్యం పాలయింది. మంచమ్మీదే అన్నీ–అనే స్థితికి వచ్చేసింది. 'మూడు నెలలకో ఇంట్లో' అంటూ కుమారులు ఆమెని వంతులు వేసుకున్నారు. మూడునెలలు కాగానే ఆమెని మంచమ్మీది దుప్పటితో సహా మోసుకెళ్లి తర్వాతవారి ఇంట్లో వదిలేసేవారు. 'మెల్లిగా లేపండర్రా, నొప్పిగా ఉంది' అని బాధతో ఆమె కేకలు వేస్తున్నా పట్టించుకోకుండా కదిలించేవారు. అది చూశాక అటువంటి తల్లుల కోసం, తండ్రులకోసం ఏదైనా ప్రయత్నం చెయ్యాలనిపించింది. కొంత ఆలోచన తర్వాత ఈ చైతన్య యాత్రను తలపెట్టాను. కాలినడకనో, లేదా మామూలుగానే ప్రయాణం చెయ్యకుండా నేననుకున్న లక్ష్యం సాధించడానికి పద్దెనిమిదేళ్ల పద్దెనిమిదివారాల పద్దెనిమిది రోజులు పడుతుంది. కాలినడకనో, బస్సులూ రైళ్లల్లోనో వెళితే సమయం సరిపోదు. ఎక్కువమందిని చేరుకోలేను. అందుకే నా దగ్గరున్న పాత ఎల్‌ఎమ్‌ఎల్ వెస్పా స్కూటర్‌కే మార్పు చేర్పులు చేసి చైతన్య రథంగా చేసుకున్నాను. వండుకోవడానికి చిన్నపాత్రలు, రాత్రిపడుకోవడానికి వసతీ అన్నీ ఇందులోనే ఉన్నాయి.

–నేను రామభక్తుణ్ణి, తల్లితండ్రులతో ఎలా ప్రవర్తించాలో చూపిం చిన ఉత్తమ పుత్రుడు రాముడే. దాన్ని సూచించడానికే ఆయన పటం పెట్టాను. ఇంకో కారణం కూడా ఉంది. నేను ఊరకే వెళ్లి ఎక్కడో ఒకచోట నిలబడి 'మీ తల్లి దండ్రుల్ని గౌరవించండి' అంటూ ఉపన్యాసిలిస్తే ఎవరు వింటారు? అలాకాకుండా నేను వెళ్లిన ప్రతిచోటా, అడిగిన ప్రతి వారి ఇంట్లోనూ రామపాదుకా పూజను నిర్వ హించి, అక్కడకు వచ్చిన అందరికీ పూజ అనంతరం తల్లిదండ్రుల విశిష్ఠత గురించి వారినెలా చూసుకోవాలో చెబుతాను. కులమత వర్గవర్ణ భేదాల్లేకుండా ఎవరింటికైనా వెళ్ళి పూజ చేస్తాను. కిందటేడాది జనవరి ముప్పైన భద్రాచలంలో రాముడి సన్నిధిలో మొదలయిన నా యాత్ర 2029 మే 24న ముగుస్తుంది. ఈలోగా 9999 మంది ఇళ్లలో పూజలు చేస్తాను. ఇరవైమందికి తక్కువకాకుండా ప్రతి ఇంట్లోనూ నా సందేశాన్ని వినిపిస్తాను. ఇదిగాకుండా ప్లాస్టిక్‌ని వాడొద్దనీ, స్వధర్మమూ, స్వదేశమూ గొప్పవని భావన నూరిపోస్తుంటాను. నేను 1989లో శబరిమలకు 3200 కి.మీ దూరం 119 రోజుల్లో పాదయాత్ర చేశాను. తర్వాత సైకిల్ మీద వెళ్లొచ్చాను. భద్రాచలానికి కూడా కాలినడకన, సైకిల్‌మీద కూడా వెళ్లొచ్చాను. కొత్త ప్రాంతాలను చూడటం, కొత్తవారికి నా సందేశాన్ని వినిపించడం నాకో ధర్మ ప్రబోధయాత్రయిది.

నా పిల్లలు కాలేజీల్లో చదువుకుంటున్నారు. నా భార్య పాతపట్నంలోనే ఉంటుంది. ప్రతినెలా ఏకాదశినాడు ఇల్లు చేరుకుని ప్రపంచంలోని అమ్మానాన్నల క్షేమం కోసం సత్యనారాయణ వ్రతం చేస్తుంటాను. పూజలు చేయించుకున్నవారు, ఇతరులు తమకు తోచింది ఇస్తుంటారు. సత్ఫలిచ్చేవరకూ నా ప్రయత్నం కొనసాగిస్తాను అన్నాడా మాతాపితా దేవతా భావ ప్రచారకుడు. ●



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## 82

## పండ్రెండవ అధ్యాయము - భక్తి యోగము

**8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశాయ**
**నివనిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః.**

వ్యాఖ్య:- విద్యార్థికి ఉపాధ్యాయుడెట్లు పాఠములను బోధించునో, ఆప్రకారముగా భగవానుడర్జునునకిపుడు ఒకటితరువాత మఱియొకటిగ పెక్కుసాధనలను తెలియజేయబోవుచున్నాడు. ప్రథమున మనస్సును, బుద్ధిని పరమాత్మయందు స్థిరముగ నిలుపులాగున ఆనతిచ్చిరి. ఇది మొదటి పాఠము. మనస్సును మాత్రము నిలిపినచాలదా, బుద్ధిని కూడ ఏలజోడించవలెను? అని ప్రశ్నించినచో, బుద్ధి నిశ్చయము చేయునది కావున, అది లేనిచో మనస్సు సంకల్పవికల్పములతో గూడియున్నదై చంచలముగ నుండును. మనస్సు సంకల్పించును, బుద్ధి నిశ్చయించును. కాబట్టి భగవద్విషయమై దృఢమగు నిశ్చయమును గలుగజేయునది బుద్ధియే, కావున దానిని గూడ మనస్సుతో చేర్చిచెప్పిరి. అట్లు మనోబుద్ధుల రెండిటిని ఇతరమైన దృశ్యవస్తువుల వేనియందును ప్రవేశింపనీయక ఒక్క భగవంతునియందు సంలగ్నమైయుండులాగున ప్రయత్నించవలెను. అట్లుచేసినచో నిక మనుజుడు ధ్యేయవస్తువగు ఆ పరమాత్మయందే సదా నివసింపగలడు. ఆహా! ఎంతటి గొప్పస్థానమం దతడు నివాసము బడయును! ఉప్పుకల్లు సముద్రము నందు లయించునట్లు మనస్సు నిరంతరము దేనిని గూర్చి ధ్యానించునో, దేనియందు సంలగ్నమైయుండునో, దానియందే లయించి తదాకారాకారితమై యొప్పును. కావున అనవరతము భగవంతునియందు స్థిరముగనుండునట్టి మనస్సు క్రమముగ ఆ దైవాకారమునే పొందిపోవును. అదియే మోక్షము. దేవునియందు నివసించుట యనగా నిదియే. ఇవ్విషయమున ఏ మాత్రము సందేహములేదనియు, ఇది పరమసత్యమనియు భగవానుడు తెలియజేసిరి. కాబట్టి సాధకులు తమ మనస్సును అన్యత్ర పోనీయక ధ్యానాదుల ద్వారా ప్రయత్నపూర్వకముగ భగవంతునియందు నిలిపినచో ఇక తమ మోక్షవిషయమై ఏలాటి సంశయమున్ను పెట్టుకొన నక్కరలేదని స్పష్టమగుచున్నది.

**9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనఞ్జయ.**

వ్యాఖ్య:- మొదట తెల్పిన సాధన చేయలేనివారికి భగవానుడు మఱికొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను సూచించుచున్నారు. ఆహా! భక్తులపై, సాధకులపై సర్వేశ్వరునకు ఎంతటి కరుణ! మనస్సుచేతనే బంధము, మనస్సుచేతనే మోక్షము జీవునకు కలుగుచున్నవి. కాబట్టి మోక్షము పొందుటకు ఆ మనస్సు ఏదో విధముగ అధిష్ఠానమగు పరమాత్మయందు (దైవమందు) లయించియే తీరవలెను. ఇక్కారణముననే గీతాచార్యులు మనస్సు దైవమందు నిలుకడను బొందనిచో అభ్యాసముచే నెట్లైనను దానిని నిలుకడబొందులాగున చేయువలయునని, (అది తప్ప మోక్షమునకు వేరుదారిలేదని) తెలియజేయుచున్నారు. ప్రతివారును ఏదియోవిధముగా తమ మనస్సును బహిర్ముఖముగ పోనీయక, దృశ్యవిషయములపై వ్రాలనీయక, ఆత్మయందు (దైవమందు) స్థాపనచేయవలెను. ఒకవేళ ప్రారంభస్థితిలో అట్లు మనస్సు ధ్యేయమందు నిలుకడను బొందనిచో అభ్యాసముచే మెల్లమెల్లగా ఆ స్థితిని ఎట్లైనను సాధించియే తీరవలెను. మనస్సు ఆత్మయందు లయించి, ఆత్మరూపమున శేషించుటయే మోక్షము. కావున ఆ స్థితిని ప్రయత్నపూర్వకముగ అభ్యాసము ద్వారా ప్రతివారును సాధించవలెను. 'యతో యతో నిశ్చయతి... (6-26)' అని 6వ అధ్యాయమున భగవానుడు తెలియజేసినరీతి చపలమనస్సును నెమ్మదిగా వశమొనర్చుకొని ఆత్మయందు (దైవమందు) స్థాపించవలెను. ఇట్టి అభ్యాసమును గూర్చియే ఈ శ్లోకమందు తెలియజేయబడినది.

**10. అభ్యాసేఽ ప్యసమర్థోఽ సి మత్కర్మపరమో భవ**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి.**

వ్యాఖ్య:-ఒకవేళ పైనదెల్పిన ఐకాగ్రతాభ్యాసమును గూడ యెవరైన చేయజాలనిచో అట్టివారు తరించుటకై మఱియొక ప్రత్యామ్నాయ పద్ధతిని భగవానుడు కరుణతో సూచించుచున్నారు. మనోనిశ్చలత్వమును సాధింపలేనివాడు క్రమముగ దైవకార్యలందును, ధర్మకార్యములందు, పరోపకారక్రియలందు, పరప్రాణులకు హితమొనర్చుకార్యములందు ఆసక్తి గలిగి వానిని నిష్కామముగ నాచరించుచురావలయును. జపము, ప్రార్థన, కీర్తన, భజన, పూజ, వ్రతములు మున్నగువానిని భగవత్ప్రీత్యర్థము గావించుచుండవలెను. 'మత్కర్మపరమోభవ' అనుదాని యర్థమిదియే. దానిచే చిత్తము శుద్ధముకాగా, క్రమముగ జ్ఞానమంకురింప, దానిచే మనుజుడు మోక్షసిద్ధిని బడయగలడు. ఈ ప్రకారముగ కర్మాచరణయు ఎట్టకేలకు ముక్తిని ప్రసాదించును. అతి సూక్ష్మమైన మనస్సును, సంకల్పములను అరికట్టలేనివారికి- ఈ కర్మమార్గము ఎంతయో సులభతరమై యుండగలదు. అయితే 'మదర్థం' అని భగవానుడు చెప్పెనే కాని 'త్వదర్థం' అని చెప్పలేదు. కావున ఆయా క్రియలను దైవప్రీత్యర్థముగనే ఒనర్చవలెనుగాని, స్వార్థము కొఱకుగాదు. నిష్కామముగనే ఆచరించవలెనుగాని, సకామముగగాదు.

'కుర్వన్ సిద్ధి మవాప్స్యసి'- అను వాక్యము ద్వారా కర్మయోగమున్ను మోక్షసిద్ధికి హేతువు కాగలదని స్పష్టమగుచున్నది. ఎట్లనిన, ఆ కర్మలు, నిష్కామముగ, (దైవప్రీత్యర్థముగ) నాచరింబడినచో చిత్తశుద్ధిని, తద్ద్వారా జ్ఞానమును, తద్ద్వారా మోక్షసిద్ధిని అవి కలుగజేయగలవు. అయితే నిష్కామాచారణకు మాత్రమే యిట్టి శక్తి కలదనియు, సకామాచరణకుగాదనియు నెఱుంగవలెను.

**11. అథైతదప్యశక్తోఽ సి కర్తుం మద్యోగమాశ్రితః**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్.**

వ్యాఖ్య:- పైన తెలిపిన మూడుసాధనలున్ను చేయజాలనివారికి సులభమైన మఱియొక పద్ధతిని భగవానుడిచట సూచించిరి. ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పరుండవఱకును మనుజుడు అనేక కార్యములు చేయుచుండునుగదా! ఆయా కార్యములు చేయునపుడు దైవభావముగలిగి, తాను నిమిత్తమాత్రుడేయని భావించుకొని, సమస్తజగత్క్రియలు ఆ సర్వేశ్వరుడే జరుపుచున్నాడని నిశ్చయించుకొని, తాను చేయు ఆ సమస్తకార్యముల యొక్క ఫలములను ఆ సర్వేశ్వరునకే అర్పించవలెను. అనగా ఫలాపేక్షను వదలి ఈశ్వరార్పణబుద్ధితో ఆయా కర్మలను చేయవలెను. సమస్తకర్మలని చెప్పుటచే అసత్కార్యములు, పాపకార్యములుకూడ అనియెవరును భావించరాదు. ఏలయనిన అవి మొదటనే శాస్త్రములచే నిషిద్ధములైయున్నవి. కావున వాని నెవరును ఆచరించగూడదు. దానధర్మములు, వ్రతపూజాదులు, నిత్యనైమిత్తికకర్మలు ఇంకను, తన దినచర్యయందలి వివిధక్రియలు ఆచరించునపుడు దైవభావము కలిగి, ఆయా కర్మలయొక్క ఫలమును, ఈశ్వరార్పణము, (లేక కృష్ణార్పణము, రామార్పణము) గావించవలెను. పైన తెలుపుచు వచ్చిన పద్ధతులలో ఒక్కొక్కదానికంటె మఱియొకటి ఉత్తరోత్తర సులభతరమై యుండుటచే సాధకులలో ఎవరెవరికి ఏయే సాధన అనుకూలముగనుండునో, వారి వారి మనస్తత్వములనుబట్టి దానిని యేరుకొని, చక్కగ సాధించవచ్చును. చివరికి చెప్పబడిన ఈ సాధన అనగా తాను చేయు సమస్తకార్యముల యొక్క ఫలములను భగవదర్పణము గావించుట యనుదానిని సామాన్యులు కూడ ఆచరించి తరింపవచ్చును. తాను నడుచుచున్నదే అది భగవంతునకు ప్రదక్షిణమని భావించవలెను. మాట్లాడుచున్నచో అది దైవసంకీర్తనమని యెంచవలెను. ఈ ప్రకారముగ ఏపని చేయుచున్నను భగవత్స్మృతి కలిగి 'మామనుస్మర యుధ్యచ' అని గీతాచార్యులు తెలిపిన విధమున అట్టి దైవసంస్కారముతో తానాచరించుచు ఆయా కార్యములన్నిటి యొక్క ఫలమును ఈశ్వరార్పణము గావించినచో, క్రమముగ పాపము నశించి, చిత్తశుద్ధి గల్గి జ్ఞానోదయమయి క్రమముగ మోక్షము లభించగలదు.

అయితే ఇట్టిస్థితి కలుగుటకు అనగా సర్వకర్మ ఫలత్యాగము చేయుటకు కొంతమనోనిబ్బరము, మనోనియమనశక్తి, ప్రయత్నము ఆవశ్యకమైయున్నది. కనుకనే (యతాత్మవాన్) అని చెప్పబడినది. పట్టుదలతో ప్రయత్నపూర్వకముగ మనస్సును నియమించుకొనుచు (స్వాధీనమందుంచుకొనుచు) సర్వకర్మఫలత్యాగమును ఆ సులభతరమైన చక్కటి పరమార్థసాధనను జీవులు అమలునందుంచవలెను.

(తరువాయి వచ్చే సంచికలో)